క్లుప్తంగా

ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయండి



సీఐకి వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా ప్రతినిధులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళలను వేధింపులకు పాల్పడే ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని ఐద్వా పశ్చిమ నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శేష్మణి, జీ ఆదిలక్ష్మి తదితరులు కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యానికి సోమవారం వినతిపత్రం అందజేశారు. గొల్లపాలెంగట్టు రోడ్డు, పొట్టి శ్రీరాములు కాలేజీ రోడ్డు, నైజాంగేటుతో పాట వించిపేటలో సాయంత్రం ఆరు గంటల తర్వాత యువకులు గుంపులుగా చేరి కళాశాల నుంచి వచ్చే విద్యార్థినులను, పనుల నుంచి వచ్చే మహిళలను వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. సీఐ సుబ్రహ్మణ్యం స్పందిస్తూ మహిళలను, విద్యార్థినులను వేధింపులకు గురి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీఐని కలిసిన వారిలో ఐద్వా ఆఫీస్ బేరర్స్ విక్రయ్ లక్ష్మీ, కే ఉషా, షాకిర, దుర్గ ఉన్నారు.

నగర షూటర్లు సత్తా



పతకాలు సాధించిన షూటర్లను అభినందిస్తున్న డీవీఈఓ, ఆర్ఐఓ

విజయవాడ స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ అండర్–19 రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో విజయవాడ షూటర్లు సత్తా చాటారు. రాజమండ్రిలో ఇటీవల జరిగిన ఈ పోటీలకు ఉమ్మడి కృష్ణాజిల్లాకు ప్రాతినిధ్యం వహించిన ఎం.గోపిక పీప్‌సైట్ బాలికల విభాగంలో, బి.కావ్యనాగిని పిస్టోల్ బాలికల విభాగంలో గోల్డ్ మెడల్‌ను సాధించారు. అదేవిధంగా బి.నిశిత పీప్‌సైట్ బాలికల విభాగంలో, సీహెచ్.ప్రణీత్ పీప్‌సైట్ బాలుర విభాగంలో, కె.యశ్వంత్ పిస్టోల్ బాలుర విభాగంలో సిల్వర్ మెడల్‌ను, కె.శ్రీవత్సవ పీప్‌సైట్ బాలుర విభాగంలో, సేక్ సాల్మా పీప్‌సైట్ బాలికల విభాగంలో బ్రాంజ్ మెడల్‌ను దక్కించుకున్నారు. అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించి పతకాలు సాధించడమే కాకుండా రాష్ట్ర జట్టులో స్థానం దక్కించుకుని జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ క్రీడాకారులను ఎన్టీఆర్ జిల్లా డీవీఈఓ సి.ఎస్.ఎస్.ఎన్.రెడ్డి, ఆర్ఐఓ పి.రవికుమార్, స్కూల్ గేమ్స్ అండర్–19 జిల్లా కార్యదర్శి వి.రవికాంత అభినందించారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన



డ్రగ్స్ వాడకంతో కలిగే నష్టాలను తెలియజేస్తున్న డీఎస్పీ ప్రభాకర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు–జీవితం ముద్దు' నినాదంతో కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై సోమవారం అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భవానిపురం సీఐ శ్రీనివాస్, సెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డీఎస్పీ ప్రభాకర్ మాట్లాడారు. డ్రగ్స్ వాడకానికి దూరంగా ఉండాలని, తమకు తెలిసి ఎవరైనా డ్రగ్స్ వాడుగున్నట్లు గుర్తిస్తే తమకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి లక్ష్మణస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, డాక్టర్ ఎస్.మణికంఠ, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నారని, పేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. స్థానిక దుర్గాపురంలో సోమవారం జండూ ఫార్మా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. తొలుత ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్యే వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు దోహదపడతాయన్నారు. తోటివారికి సాయం చేయడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. అనంతరం వైద్యులు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి పాల్గొన్నారు.

జనాదరణ ఉన్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): ప్రజల్లో జనాదరణ ఉన్న నాయకుడు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం 34వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ బండి నాగేంద్ర పుణ్యశీలతో కలిసి పర్యటించారు. ముందుగా డివిజన్‌లోని ఎర్రకట్ట వద్ద ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డివిజన్‌లోని పలు వీధుల్లో తిరిగి ప్రజలనుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హులైన వారికి పథకాలు అందకపోతే సచివాలయంలో లేదా తన దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు పరిష్కారానికి స్థానిక కార్పొరేటర్ సూచనలతో పనులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. చిన్న సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి లేదా కార్పొరేటర్ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తారని తెలిపారు. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి అయిన తర్వాత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేశారని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు, గోరుముద్దతో పిల్లలకు బలవర్ధకమైన ఆహారం, రైతు భరోసాతో రైతులకు చేయూతను అందిస్తున్న ఏకైక సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. రాష్ట్రంలో పేదల కష్టాలు తెలుసుకుని, వారిని ఆదుకుంటున్న ఏకైక నాయకుడు అని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజలు వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని తెలిపారు. ఎంతమంది గ్రూపులుగా వచ్చినా తమ నాయకుడు ఒంటరిగా ఎదుర్కొంటారన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు మాబు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్ప యాత్ర ఫలితమే నవరత్నాలు



చెరువు సెంటర్లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రత్నకుమారి, దుర్గారావు



కబేళాసెంటర్లో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న మైలవరపు కృష్ణ, పార్టీ నాయకులు



47వ డివిజన్ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గోదావరి గంగ, నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నాడు ప్రతిపక్ష నేతగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సుదీర్ఘ ప్రజాసంకల్ప యాత్ర ఫలితమే నేడు అమలవుతున్న నవరత్నాలని పలువురు కార్పొరేటర్లు పేర్కొన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను మేనిఫెస్టోలో రూపొందించి మూడున్నరేళ్ల పాలనలోనే 98.4 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసి నేటికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పలు డివిజన్ల కార్పొరేటర్లు సోమవారం తమ డివిజన్‌లో వేడుకలు నిర్వహించారు. విద్యాధరపురం చెరువు సెంటర్‌లో 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. వీరంకి సత్యనారాయణ, అంకాన నాగరాజు, వీ సుబ్బారావు, సర్వోత్తమరావు, ఉస్మాన్ బేగ్, వల్లం రవికుమార్, ఇనపకుర్తి రాము, వీ రాజు, వీ రాము, వీ శ్రీనివాస్, దూండీ, నానీ పాల్గొన్నారు.

45వ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో..

విద్యాధరపురం కబేళా సెంటర్‌లోని 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్య కార్యాలయంలో ఆమె తండ్రి మైలవరపు కృష్ణ ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికినివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ముత్తా వాసు, బైపినేని కోటేశ్వరరావు, ముత్యాల రాంబాబు,పీతల నాగు, లింగయ్య, నల్లం వాసు, గుండు లక్ష్మీ, ముడుపు పద్మ, రవ్వ కోటేశ్వరి, మణికంఠ పాల్గొన్నారు.

47వ డివిజన్ కార్యాలయంలో..

స్థానిక కేఎల్‌రావునగర్‌లోని 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ కార్యాలయంలో ఆమె వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. గోదావరి బాబు, కూరాకుల నాగ, మద్దిరాల కమలాకర్, కామళ్ల జోజి, వరకాల జోషి, తాండ్ర ఇంద్రకుమార్, కె కాశేశ్వరరాజు, పీ పాండు, బోయళ్ల రాజేష్, విజయలక్ష్మి, ఆనంద్, దుర్గారావు, ప్రవీణ్, మీనా సాయి, కిషోర్ పాల్గొన్నారు.

48వ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర నిర్వహించి నాలుగేళ్లు పూర్తయిన నేపథ్యంలో 48వ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. డివిజన్ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిచ్చా, ఐతా కిశోర్, కోళ్లరజనీ, జానీ, వరలక్ష్మీ, హరిభాస్కర్, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

ఏఐకేఎస్ నేత విజ్జు కృష్ణన్



మాట్లాడుతున్న విజ్జు కృష్ణన్

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, రైతాంగ హక్కుల సాధనకు ఏప్రిల్ 5వ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐకేఎస్) అఖిల భారత నాయకుడు విజ్జు కృష్ణన్ పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఏపీ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ రాష్ట్ర కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం చలో ఢిల్లీ విజయవంతానికి రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజ్జు కృష్ణన్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంపదనంతా పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు దోచిపెడుతోందని ఆరోపించారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను అరికట్టకపోతే దేశ భవిష్యత్తకే ప్రమాదం ముంచుకొస్తుందన్నారు. హక్కుల సాధన కోసం ఢిల్లీలో ఏప్రిల్ 5న జరిగే మహాప్రదర్శన, నిరసన సభలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా సదస్సు పలు తీర్మానాలు చేసింది. సదస్సులో సీఐటీయూ నాయకుడు ఎం.ఎ.గఫూర్, ఏఐఏడబ్ల్యూయూ నాయకుడు బి.వెంకట్ మాట్లాడారు.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి జైలు

విజయవాడ స్పోర్ట్స్: దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డి.సత్యవతి సోమవారం తీర్పు చెప్పారు. విజయవాడ కొత్తూరు తాడేపల్లిలోని తాళం వేసి ఉన్న ఇంట్లో ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లికి చెందిన భూక్యా రామచంద్రరావు గత ఏడాది జూలై 18వ తేదీన దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత కొత్తపేట స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి రెండు రోజుల తరువాత నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద రూ. 7 వేలను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిషోర్ కోర్టుకు వాదనలు వినిపించారు. ఎనిమిది మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు రామచంద్రరావుకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పండగ పేరుతో జరిగే జూదాలను అడ్డుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ శ్రీనివాసరావు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పండగలు, సంప్రదాయాల పేరిట జరిగే కోడిపందేలు, ఇతర జూదాలను అడ్డుకోవాలని డీసీపీ వెస్ట్ జోన్ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. చిట్టినగర్‌లోని మోతీ మసీదు షాదీఖానాలో సోమవారం గ్రామ, వార్డు మహిళా పోలీసులతో డీసీపీ కె. శ్రీనివాసరావు, కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ రూరల్ ప్రాంతాలతో పాటు కొండ ప్రాంతాలు, శివారు ప్రాంతాల్లో ఎక్కువగా కోడి పందెలు నిర్వహిస్తుంటారని, గతంలో అటువంటి కార్యకలాపాలకు పాల్పడిన వారిపై మహిళా పోలీసులు దృష్టి సారించాలన్నారు. ప్రజా జీవనానికి ఆటంకం కలిగించినా, శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలిగించే కార్యకలాపాలను నిర్వహించినా వెంటనే స్టేషన్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

జూదరులపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రిక మీనాక్షి నగర్లో బహిరంగ ప్రదేశం నందు పేకాడుతున్న ఎనిమిది మందిని నున్న పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకుని వారి పై కేసు నమోదు చేశారు. సీఐ కె.శ్రీనివాసరావుకు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై గోవిందు సిబ్బందితో వెళ్లి పేకాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకొచ్చారు.

రాజకీయ హత్యలను సమర్థించడం సిగ్గుచేటు

భవానీపురం(విజయవాడపశ్చిమ): చంద్రబాబుకు తోక పార్టీలా వ్యవహరిస్తూ ఆయన కందుకూరు, గుంటూరులో రోడ్ షో నిర్వహించి 11 మంది అమాయకులను బలి తీసుకోవడాన్ని సమర్థిస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చేసిన వ్యాఖ్యలు సిగ్గు చేటని వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం నగర అధ్యక్షుడు పోతిరెడ్డి సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు సీట్ల కోసం కక్కుర్తిపడి చంద్రబాబును పొగుడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం తగదని తెలిపారు. ప్రభుత్వం జీఓ నంబర్–1ను తీసుకొస్తే దానిని వ్యతిరేకించటం హాస్యాస్పదంగా ఉందని, రాష్ట్రంలో రోడ్ షోలను మాత్రమే ప్రభుత్వం నిషేధించిందనే విషయాన్ని రామకృష్ణ తెలుసుకోవాలని పేర్కొన్నారు.

13 నుంచి అంకమ్మతల్లి శక్తిపీఠం వార్షికోత్సవ వేడుకలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ లక్ష్మీపతి, శరాబంధీరావు, బచ్చామేస్త్రి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అంకమ్మతల్లి శక్తిపీఠం వార్షికోత్సవ వేడుకలలో ప్రజలందరూ పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి పేర్కొన్నారు. స్థానిక మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో సోమవారం వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావుతో కలసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 18వ తేదీవరకు నిర్వహించనున్న వార్షికోత్సవ వేడుకలను విజయంతం చేయాలని సూచించారు. పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబంధీరావు మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ ఉదయం 5.30 గంటలకు అమ్మవారి సుప్రభాత సేవ, విఘ్నేశ్వరపూజతో వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. వార్షికోత్సవంలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ చిగురుపాటి వరప్రసాద్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. నాయకులు బచ్చా మేస్త్రి పాల్గొన్నారు.

తల్లి అదృశ్యంపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): తల్లి అదృశ్యంపై నున్న పోలీసు స్టేషన్లో సోమవారం ఫిర్యాదు అందింది. పాయకాపురం, ఏపీఎస్ రెడ్డి రోడ్డులో ఉంటున్న కొక్కలవ్య హేమలత డ్వాక్రా మహిళా సంఘం ప్రెసిడెంటుగా పనిచేస్తోంది. 9వ తేదీ ఉదయం 5గంటలకు వాకిట్లో ముగ్గువేసిన అనంతరం ఆమె కనిపించలేదు. ఒత్తిడికి తట్టుకోలేక వెళ్లిపోతున్నట్లు డైరీలో రాసింది. ఆమె కుమారుడు ఉదయ్‌తేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుంటూరులో విజయవాడ వాసి మృతి

గుంటూరు ఈస్ట్: అనుమానాదస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం ప్రకారం గత నెల 25వ తేదీ సెయింట్ జోసఫ్ హాస్పిటల్ మెయిన్ గేటు ఎదురుగా ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ మృతదేహాన్ని పరిశీలించి అతని జేబులోని ఆధార్‌కార్డు ఆధారంగా విజయవాడ, గాంధీనగర్‌కు చెందిన జి.రంగారావు (48)గా గుర్తించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఇప్పటివరకు అతని అడ్రస్సు వివరాలు తెలియరాలేదు. సమాచారం తెలిసిన వారు 86888 31336కు ఫోన్ చేయాలని కోరారు.

ఆకట్టుకున్న గాన గంధర్వ మణిహారం

విజయవాడ కల్చరల్: నాద వినోదా మ్యూజిక్ (యూఎస్ఏ) అకాడమీ, జాషువా సాహిత్యవేదిక, సుమధర కళానికేతన్, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం ఆధ్వర్యంలో నూతన సంవత్సం వేడుకల సందర్భంగా బందరురోడ్డులోని మాకినేని బసవ పున్నయ్య భవన్‌లో సోమవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ప్రవాసాంధ్ర గాయని మణి శర్మ ఆధ్వర్యంలో చంద్రతేజ, వినోద్‌బాబు, శేషకుమారి ఆ పాత మధురాలను మధురంగా గానం చేశారు. గాయని మణి శాస్త్రి మాట్లాడుతూ తెలుగు వారి ప్రతిభను చాటేందుకు అమెరికాలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో గోళ్ల నారాయణరావు, గుండు నారాయణ పాల్గొన్నారు.

వివేకానందుని బోధనలు ముందు తరాలకు అందించాలి



వివేకానంద స్ఫూర్తి అవార్డులు అందుకున్న వారితో ఏఎండీ ఇంతియాజ్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): భారతీయ యువతను అద్భుతంగా ప్రభావితం చేసిన స్వామి వివేకానందుని బోధనలు, భావాలు ముందు తరాలకు అందించాలని ఏపీ మైనారిటీ శాఖ ముఖ్యకార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నలంద డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ సేవకులకు స్వామి వివేకానంద స్ఫూర్తి అవార్డులను అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇంతియాజ్ తొలుత వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ ఆధ్యాత్మిక సాంప్రదాయాలతో పాటు, వివేకానందుని విశాల దృక్పథమే ఆయన రచనలు, ఉపన్యాసాలలో ప్రతిఫలిస్తుందన్నారు. ఈ సందర్భంగా వి వెంకటేశ్వరరావు(విజయవాడ), డి ఆంజనేయప్రసాద్(హైదరాబాద్), ఎస్ రవీంద్రారెడ్డి (పలమనేరు), వై శ్రీలక్ష్మి(విజయవాడ), షేక్ రఫీయాబేగం(విజయవాడ)ను సత్కరించి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో వేముల హజరత్తయ్య గుప్తా, పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేన్ అధ్యక్షుడు కె మురళీమోహన్‌రాజు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ పాల్గొన్నారు.

స్పందన అర్జీలు గడువులోగా పరిష్కరించాలి

మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో సమస్యలను అధికారులు పరిష్కారదశగా చర్యలు తీసుకోవాలని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్‌కంట్రోల్ రూంలో జరిగిన స్పందనలో ఆమె అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీదారుని సమస్యను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నగరపాలక సంస్థ కల్పిస్తున్న మౌలిక సదుపాయాలలో వారు ఎదుర్కొన్న ఇబ్బందులపై అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా, సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (జనరల్) ఎం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డిప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) డి.వెంకటలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డా.కె.బి.ఎస్.ఎస్ లతా, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, మేనేజర్ బి.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయాల్లో..

జోనల్ కమిషనర్లు నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సర్కిల్–3 కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగం–1, పట్టణ ప్రణాళికవిభాగం–1 అర్జీ, సర్కిల్ –2, సర్కిల్–1 కార్యాలయంలో ఎటువంటి అర్జీలు అందనట్లు జోనల్ కమిషనర్ తెలిపారు.

అందుబాటులో దివ్యాంగ్ జన్ రైల్వే కన్సెషన్ ఐడీ



విజయవాడ డివిజన్ రూపొందించిన దివ్యాంగ్ జన్ రైల్వే కన్సెషన్ అప్లికేషన్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ కమర్షియల్ విభాగం దివ్యాంగ్ జన్ రైల్వే రాయతీకి దరఖాస్తు చేసుకునే లబ్ధిదారుల కోసం వెబ్ ఆధారిత 'దివ్యాంగ్ జన్ రైల్వే కన్సెషన్ ఐడి కార్డు సిస్టం'ను అభివృద్ధి చేశారు. డిసెంబర్ 22న డివిజన్ వార్షిక తనిఖీల్లో తెనాలి–గూడూరు సెక్షన్ల మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ప్రారంభించారు. ఈ కొత్త విధానంలో విజయవాడ డివిజన్ పరిధిలో నివసిస్తున్న దివ్యాంగులు సమాచారం అందుబాటులో ఉంటుంది. ఐడీ కార్డు కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు పూర్తి చేసి, సంబంధిత ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయడం ద్వారా ఐడీ కార్డు సులభంగా పొందవచ్చు. దివ్యాంగుల విలువైన సమయం, భౌతిక ప్రయాణాన్ని తగ్గించడంతో పాటు సులభంగా ఐడీ కార్డులు పొందవచ్చని సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు తెలిపారు. అప్లికేషన్ రూపొందించిన డివిజన్ ఐటీ ఉద్యోగులను డీఆర్ఎం శివేంద్రమోహన్ అభినందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



డీఎస్ఎం పూర్వ విద్యార్థుల కలయిక

భవానీపురం(విజయవాడపశ్చిమ): వారంతా విద్యాధరపురం మారయ్య హోటల్ సెంటర్లోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్లో 1983–88 మధ్య కలిసి చదువుకున్నారు. మూడున్నర దశాబ్దాల తరువాత భవానీపురంలోని ఒక హోటల్లో సోమవారం సమావేశమయ్యారు. ఇక వారి సంతోషానికి అవధులు లేవు. వయసు, హోదాలు మరిచి ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకుని ఆలింగనాలు చేసుకున్నారు. విద్యార్థి దశలో చేసిన చిలిపి పనులు, తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకుని గత స్మృతులను నెమరవేసుకున్నారు. ఆడి పాడి అలసిపోయి వచ్చే సంవత్సరం మళ్లీ ఇలానే కలుసుకుందాం ఫ్రెండ్స్ అంటూ తాత్కాలిక వీడ్కోలు తీసుకున్నారు. ఆత్మీయ కలయిక బాధ్యతలు తీసుకున్న పూర్వ విద్యార్థులు రవికాంత్, లక్ష్మీనారాయణ, నర్సింహా నందం, జ్ఞానమూర్తి, భువనేశ్వరి, కరిమున్నీసా, మరియమ్మను మిగిలిన వారంతా అభినందించారు.

పిచ్చి కుక్క వీరంగం.. పలువురికి గాయాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం రాము క్వారీ సెంటర్లో సోమవారం ఒక పిచ్చి కుక్క వీరంగం చేసి, పలువురిని గాయపరిచింది. స్థానికులు డీ రాము, ఇజ్రాయేల్, శ్రీనుతోపాటు మరి కొందరిని కరవడంతో చుట్టుపక్కలవారు భయభ్రాంతులకు గురయ్యారు. విషయాన్ని నగరపాలక సంస్థ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రవిచంద్‌కు స్థానిక సోషల్ వర్కర్ డీ రాము తెలియపరచారు. వెంటనే కొత్తపేటలోని షేక్ రాజా హాస్పిటల్‌కు వెళ్లి యాంటీ రాబిస్ ఇంజెక్షన్లు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ రాము క్వారీ సెంటర్‌లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.



